అన్ని రంగాల్లో మహిళలకు చేయూత

- నియోజకవర్గ ఇన్‌చార్జి విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే కొండేటి
- అయినవిల్లి, అంబాజీపేట మండలాల్లో చేయూత చెక్కుల అందజేత



ముక్తేశ్వరంలో వైఎస్సార్ చేయూత నమూనా చెక్కు అందజేస్తున్న విప్పర్తి వేణుగోపాలరావు, కొండేటి చిట్టిబాబు

అయినవిల్లి: రాష్ట్రంలో సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక మహిళలకు అన్నిరంగాల్లో చేయూత అందిస్తూ కుటుంబంలో తనది ప్రత్యేక పాత్రగా గుర్తించారని పి.గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి ఆధ్వర్యంలో వైఎస్సార్ చేయూత నాలుగో విడత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విప్పర్తి వేణుగోపాలరావు, కొండేటి చిట్టిబాబు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వీరు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అన్నారు. మహిళలకు అన్నింటా ప్రాధాన్యం కల్పించారన్నారు. కుటుంబంలో మహిళకు ఓ ప్రత్యేక స్థానాన్ని ఇచ్చారన్నారు. అటువంటి స్థానాన్ని కల్పించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. అనంతరం వేణుగోపాలరావు, చిట్టిబాబు 3963 మంది మహిళలకు రూ.7,43,06,250లు వైఎస్సార్ నాలుగో విడత చేయూత నమూనా చెక్కును అందజేశారు. మహిళలు సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యనారాయణమూర్తి, ఏపీఎం వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, వైస్ ఎంపీపీ బయ్యా చినబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు మట్టపర్తి వెంకటరమణ, వాసంశెట్టి తాతాజీ, బొంతు రాజేంద్రప్రసాద్ తదితరులు ఉన్నారు.

జగనన్న గ్రామ స్వరాజ్యాన్ని సాధించారు

అంబాజీపేట: గ్రామాల్లో సచివాలయాల ఏర్పాటు ద్వారా గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సాధించారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. పుల్లేటికుర్రు, మొసలపల్లి, గంగలకుర్రు, మాచవరం 2, 3 గ్రామాల్లో సర్పంచ్‌లు కాండ్రేగుల శ్రీనివాసరావు, నాగాబత్తుల శాంతకుమారిల అధ్యక్షతన నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాలను సోమవారం ప్రారంభించారు. అలాగే పలు గ్రామాల్లో ఆర్బీకేలు సచివాలయ భవనాలను ప్రారంభించారు. అన్ని వర్గాల సంక్షేమాన్ని కోరుతూ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో సంక్షేమ సారథిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలంతా ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఉభయ గోదావరి జిల్లాల గ్రీవెన్స్ కన్వీనర్ పేరి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షులు దొమ్మేటి సత్యమోహన్, నందుల ఆదినారాయణ, ఎంపీటీసీలు నెల్లి ఏడుకొండలు, మట్టా పార్వతి పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుదాం

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు గ్రామాన్ని సంపూర్ణ ఆరోగ్యంగా ఉంచడం మనందరి బాధ్యత అని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, అమలాపురం డీఎల్పీవో పి.బొజ్జరాజు అన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మంజూరు చేసిన డస్ట్‌బిన్‌లను మాచవరం పంచాయతీ కార్యాలయం వద్ద మండలంలోని 16 పంచాయతీల కార్యదర్శులకు, సర్పంచ్‌లకు సోమవారం అందజేశారు. వీటిని ప్రతి ఇంటికీ అందజేసి తడి, పొడి చెత్తను వేసేలా ప్రజలకు వివరిస్తామన్నారు.

మహిళల ఆర్థిక స్వేచ్ఛకు ప్రభుత్వం కృషి

అంబాజీపేట: మహిళా సాధికారత, వారి ఆర్థికాభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని జెడ్పీ చైర్మన్, ఇన్‌చార్జి విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. అంబాజీపేట ఎంపీపీ కార్యాలయం వద్ద ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన నాలుగో విడత వైఎస్సార్ చేయూత పథకం నిధుల మంజూరు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇన్‌చార్జి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ వైఎస్సార్ చేయూత పథకంలో భాగంగా ప్రభుత్వం 45–60 ఏళ్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు ఏడాదికి రూ.18,750లు చొప్పున నాలుగేళ్లకు రూ.75,000లు అందిస్తున్నామన్నారు. మండలానికి సంబంధించి నాలుగో విడతలో రూ.4,129 మందికి సంబంధించి 774.19 లక్షలు మంజూరయ్యాయన్నారు. అర్హులైన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ చేశారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ అధ్యక్షుడు పీకే రావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, వైస్ ఎంపీపీలు నేతల నాగరాజు, సూదాబత్తుల లక్ష్మీభార్గవి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, పార్టీ మండల అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

అయినవిల్లి: నేదునూరు, మడుపల్లిల్లో రూ.79.30 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్లు, వెలువలపల్లిలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాయ భవనాన్ని, అయినవిల్లిలంకలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ప్రారంభించారు.

వైఎస్సార్ సీపీతోనే సామాజిక న్యాయం



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బడుగు బలహీన వర్గాల వారికి సముచిత స్థానం కల్పిస్తూ పరిపాలనలో మెరుగైన గుర్తింపు ఇస్తున్నారని, బీసీలను టీడీపీ కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటే వైఎస్సార్ సీపీ అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రావులపాడు శివారు పూరేటి వారి చెరువు నుంచి శెట్టిబలిజలు టీడీపీ–జనసేన పార్టీలను వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ రానుంది సంక్షేమాభివృద్ధికి పెద్దపీట వేసిన జగనన్న ప్రభుత్వమే అని, ఇచ్చిన హామీలను మాయం చేసి ఒకరినొకరు ఆరోపణలు చేసుకున్న పార్టీలు కేవలం అధికార దాహం కోసం కలసి పేదలకు మంచి చేసిన జగనన్నపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. పార్టీలో చేరిన పెచ్చెట్టి వీరబాబు, పెచ్చెట్టి ఉసిలయ్య, కాండ్రేగుల సత్తిబాబు, కాండ్రేగుల గణేష్, పెచ్చెట్టి సత్యనారాయణ, దొమ్మేటి గణేష్, పెచ్చెట్టి ప్రసాద్, దొమ్మేటి సాయి, పెచ్చెట్టి శ్రీనివాస్, పెచ్చెట్టి ధనరాజు, పెచ్చెట్టి దుర్గాప్రసాద్, కొప్పిశెట్టి శ్రీరామ్, పెచ్చెట్టి నాగేంద్ర, పాలా సత్యనారాయణ, పాలా నాగభూషణం, కడలి ప్రసాద్, పిల్లి ముత్యాలు, పెచ్చెట్టి రాంబాబు, పెచ్చెట్టి గణేష్, కట్టా బాలాజీ, చొల్లంగి మల్లికార్జున్, చిట్టూరి శ్రీనివాసులను ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పార్టీ కండువా కప్పి వైఎస్సార్ సీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలోకి చేరిన అందరికీ సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

గడప గడపకూ నిధులతో సీసీ రోడ్లు



పల్లిపాలెంలో సీసీ రోడ్డు ప్రారంభించిన ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: సీఎం జగన్ ప్రవేశపెట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా గ్రామ సమస్యలు గుర్తించి పరిష్కారానికి కృషి చేశామని రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు పేర్కొన్నారు. మలికిపురం మండలం గూడపల్లి–పల్లిపాలెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.6 లక్షలతో వేసిన సీసీ రోడ్లను ఆయన సోమవారం ప్రారంభించారు. సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రజల కోసం పని చేసిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, సర్పంచ్ పెచ్చెట్టి నరసింహస్వామి, తాతబాబు, కానుబోయిన గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుబ్బలపాలెంలో..

మండలంలోని గుబ్బలపాలెంలో పలు అభివృద్ధి పనులను సోమవారం ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు ప్రారంభించారు. రూ.43 లక్షలతో పూర్తయిన సచివాలయం, రూ.23 లక్షలతో నిర్మించిన ఆర్బీకేను ఎమ్మెల్యే ప్రారంభించారు. సర్పంచ్ చెల్లుబోయిన శేషారత్నం, ఉల్లూరి శ్రీను, యల్లమిల్లి రామారావు పాల్గొన్నారు. పల్లిపాలెంలో రూ.43 లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.15 లక్షలతో పూర్తయిన సీసీ రోడ్లనూ ఆయన ప్రారంభించారు. యల్లమిల్లి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ అస్త్రంతో చంద్రబాబు, పవన్ చిత్తు



అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయం నుంచి ప్రచారం చేస్తున్న విప్పర్తి వేణుగోపాలరావు

అయినవిల్లి: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంధించిన నవరత్నాలతో ప్రతిపక్ష చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ చిత్తుగా ఓడిపోవడం ఖాయమని వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. సోమవారం విప్పర్తి వేణుగోపాలరావు కుటుంబ సమేతంగా అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ఆలయంలో ప్రచార రథానికి ప్రత్యేక పూజ చేసి ప్రారంభించారు. ఆయన సతీమణి అంజలిదేవి శుభ శకునంగా ప్రచార రథానికి ఎదురు వచ్చి తన భర్తకు వేణుగోపాలరావుకు, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి విజయం చేకూరాలని ఆకాంక్షించారు. విప్పర్తి ప్రచారం రథంపై ముక్తేశ్వరం వరకూ నాయకులతో కలసి ప్రచారం చేశారు. స్థానికంగా ఉన్న అంబేడ్కర్, రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పి.గన్నవరం, అంబాజీపేట మండలాల అధ్యక్షులు నక్కా వెంకటేశ్వరరావు, విత్తనాల ఇంద్రశేఖర్, ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, విఘ్నేశ్వరస్వామి ఆలయ చైర్మన్ జి.నాగబాబు, మెల్లం మహాలక్ష్మిప్రసాద్, పితాని నరసింహారావు, దొమ్మేటి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



పోతవరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ నాగలక్ష్మి

పి.గన్నవరం: విద్యార్థులు ఉత్తమ విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి అన్నారు. పోతవరం ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం కత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో సోమవారం మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. 10 మంది విద్యార్థుల తల్లులను ఆమె దుశ్శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. అనంతరం చిన్నారుల సభ జరిగింది. విద్యార్థులకు నీతి పద్యాలు, సామెతలు, కథలు తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వడలి కొండయ్య, సీఎంఓ బొరుసు సుబ్రహ్మణ్యం, డీసీఈబీ కన్వీనర్ బీర హనుమంతరావు, ఎంపీటీసీ పులపర్తి రాజారావు, ఎస్టీయూ మండలశాఖ అధ్యక్షుడు నల్లా బాలాజీ, ఉపాధ్యాయులు జి.శ్రీనివాస్, ఎండీ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రారంభోత్సవాలు



ఉయ్యూరువారి మెరక కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

సఖినేటిపల్లి: మండలంలోని ఉయ్యూరువారి మెరక, అంతర్వేదిపాలెం గ్రామాల్లో సోమవారం పలు అభివృద్ధి పనులకు రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ప్రారంభోత్సవాలు చేశారు. ఉయ్యూరువారి మెరకలో ముగుకాలువ నుంచి రూ.9.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, బలహీన వర్గాల కాలనీలో కొత్తగా వేసిన 16 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను, కారుపల్లి వారి వంతెన వద్ద నుంచి రూ.5.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే రాపాక ప్రారంభించారు. అలాగే అంతర్వేదిపాలెం–1 సచివాలయ పరిధిలో రూ.15.60 లక్షలతో నిర్మించిన తాగునీటి ట్యాంకును, మెర్లకొడపలో రూ.26 లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంకును, అంతర్వేదిపాలెం–2 సచివాలయ పరిధిలో వీరావారి గ్రూపులో రూ.16.70 లక్షలతో నిర్మించిన తాగునీటి ట్యాంకును, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన రూ.20 లక్షలతో నిర్మించిన రోడ్లను రెండింటినీ ఎమ్మెల్యే రాపాక ప్రారంభించారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్‌లు ఓగూరి రత్నకుమారి, నల్లి లీలావతి, ఎంపీటీసీలు గుబ్బల అంజి, మందపాటి రత్నం, కోనపల్లి భవాని, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలను గౌరవించడమే మన సంప్రదాయం



మహిళా దినోత్సవం వేడుకలో మహిళలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: మహిళలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పిస్తూ పరిపాలనలో 50 శాతం రిజర్వేషన్, పార్టీ పదవుల్లో సైతం రిజర్వేషన్ కల్పించిన నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి, వైఎస్సార్ సీపీ మాత్రమేనని ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎంకేఆర్ కన్వెన్షన్ హాల్‌లో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ మహిళల భద్రత కోసం దిశా చట్టాన్ని తీసుకొచ్చి వారి భద్రత కోసం కృషి చేయడం, మహిళలకు అన్ని రంగాలలో సముచిత స్థానం కల్పిస్తూ వారి అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం జగన్ ప్రభుత్వం అన్నారు. ప్రతి సంక్షేమ పథకం మహిళల బ్యాంక్ ఖాతాలలో నేరుగా జమచేసి వారి ఆర్థిక అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. ప్రజాప్రతినిధులుగా, ఇల్లాలుగా, అమ్మగా, సోదరిగా, కూతురిగా మన ఇంట్లో సంతోషాలు నింపుతూ వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న మహిళలను సత్కరించుకుని, ఆడపడుచులకు పసుపు, కుంకుమ, గాజులు, చీర, స్వీట్స్ అన్ని ఇచ్చి గౌరవించుకోవడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

పి.గన్నవరం: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని పి.గన్నవరం గ్రేస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పీవీఆర్ నాయుడు సూచించారు. జిల్లా నెహ్రూ యువకేంద్ర సంఘటన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక గ్రేస్ కళాశాల విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు. నెహ్రూ యువకేంద్ర వలంటీర్ గాదంశెట్టి బేబీ సరోజిని అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో నాయుడు మాట్లాడుతూ ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు. డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ నల్లి శ్రీచరణ్ మాట్లాడుతూ ఓటు ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా నిర్భయంగా ఓటు వేయాలని సూచించారు. విద్యార్థినులకు వలంటీర్ సరోజిని రన్ ఫిట్‌నెస్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రేస్ కళాశాలల డైరెక్టర్ మనీషా, ఇంటర్ కళాశాల ప్రిన్సిపాల్ అన్నాబత్తుల దుర్గారావు, వైస్ ప్రిన్సిపాల్ వేణుగోపాలరావు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

రాజోలు: ఓటు హక్కు వినియోగంపై రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు అధ్యక్షతన జరిగిన సదస్సులో తహసీల్దార్ కె.గోపాలకృష్ణ విద్యార్థులకు ఎన్నికలు, ఎన్నికల్లో యువత బాధ్యత, ఓటు హక్కు అంశాలను వివరించారు. ఎన్నికల్లో వినియోగించే ఈవీఎంల పనితీరును విశ్లేషించారు. ఈవీఎంలపై ఉన్న అపోహలను విద్యార్థులు గ్రామాల్లోని వయోజనులకు వివరించాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం, పీఆర్వో నల్లి రాజు, అధ్యాపకులు సరిత, ప్రతాప్‌రాజ్, కె.ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



అంబాజీపేటలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ఫొటో, వీడియో గ్రాఫర్స్ యూనియన్ నాయకులు

అంబాజీపేట: విశాఖపట్నం జిల్లా మధురవాడకు చెందిన ఫోటోగ్రాఫర్ సాయిని దారుణంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఫొటో, వీడియో గ్రాఫర్ల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గెద్దం సురేష్ డిమాండ్ చేశారు. అంబాజీపేట ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు గంటా వెంకట గిరీషదాస్ ఆధ్వర్యంలో స్థానిక నాలుగో రోడ్ల సెంటర్‌లో సోమవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఫోటోగ్రాఫర్ సాయి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని హత్యకు పాల్పడిన వారు ఎంతటివారైనా ఉపేక్షించకుండా శిక్షించి న్యాయం చేయాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎస్సై పి.చిరంజీవికి అందజేశారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు కార్యదర్శి పిల్లి వీరప్రతాప్, ట్రెజరర్ సీహెచ్ శంకర్, ఉపాధ్యక్షుడు అత్తిలి వెంకట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు

పి.గన్నవరం: ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం గర్భిణులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. వారికి వైద్య పరీక్షలు, మందులు పంపిణీ చేశారు. వై.కొత్తపల్లికి చెందిన వేణి ఫౌండేషన్ చైర్మన్ నల్లా గంగా ఈశ్వరరావు ఆధ్వర్యంలో పౌష్టికాహారం అందజేశారు. డాక్టర్ ఎస్.సంధ్యారాణి, నల్లా పెదకాపు, రాధాకృష్ణ, సిద్ధంశెట్టి రవితేజ, వెంకట్, గుర్రం అయ్యప్ప, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. నాగుల్లంక పీహెచ్‌సీలో నాగుల్లంక వైద్యాధికారులు షేక్ జాసిమ్, మహమ్మద్ రియాజ్ ఉన్నీషా బేగంల ఆధ్వర్యంలో 65 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. బోళ్ల వీరాస్వామి సత్రం ఆధ్వర్యంలో పౌష్టికాహారం అందజేశారు. ఎంపీహెచ్ఈఓ ఎ.నాగరాజు, ఎంపీహెచ్ఎస్ బీవీవీఎస్ఎన్ మూర్తి, పీహెచ్ఎన్ కె.దుర్గాబాయి, హెచ్‌వీ కెసీహెచ్ మరియమ్మ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నూకాంబిక జాతరకు అంకురార్పణ

ఆలమూరు: కోస్తా జిల్లాల్లో ప్రసిద్ధి గాంచిన చింతలూరు నూకాంబిక అమ్మవారి ఉత్సవాలకు సోమవారం అంకురార్పణ జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ నూకపెయ్యి సూరిబాబు, ఈఓ ఎంఎస్ఆర్ కృష్ణ పర్యవేక్షణలో ఏప్రిల్ 07న ప్రారంభమయ్యే జాతర మహోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారిని బుట్టగరగ రూపంలో ప్రజలకు దర్శనమివ్వనుంది. ఏటా నెల రోజుల ముందు నుంచి మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించే గ్రామోత్సవంలో పాల్గొని పూజలను అందుకోవడం ఆనవాయితీగా వస్తుంది. మార్చి 24 నుంచి పక్షం రోజుల పాటు ప్రతి రోజు రాత్రి మన్యం నుంచి తీసుకువచ్చిన మోదుగపూలతో తయారు చేసిన గరగతో జాతరలను నిర్వహిస్తామన్నారు. ఏప్రిల్ ఏడున పెద్ద జాగరణ, ఎనిమిదన తీర్థం, తొమ్మిదిన ఉగాది పర్వదినాన్ని ఘనంగా నిర్వహించనున్నారు.

నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు

మామిడికుదురు: ముస్లింలు పవిత్రంగా నిర్వహించుకునే రంజాన్ ఉపవాస దీక్షలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ దీక్షలు సోమవారం రాత్రి నెలవంక దర్శనంతో ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా 30 రోజుల పాటు ముస్లింలు కఠిన ఉపవాస దీక్షలు పాటిస్తారు. ప్రతి రోజూ ఉదయం తెల్లవారు జామున 4.30 గంటలకు 'సహరి'తో ప్రారంభమయ్యే ఈ దీక్షలు సాయంత్రం 6.20 గంటలకు 'ఇఫ్తార్'తో ముగుస్తాయి. రంజాన్ ఉపవాస దీక్షల కోసం మండలంలోని మామిడికుదురు, నగరం, కొమరాడ, మగటపల్లి, మొగలికుదురు, పెదపట్నం గ్రామాల్లోని మసీదులను సుందరంగా అలంకరించారు. మండల పరిధిలో జరిగే దీక్షల్లో ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో పాల్గొంటారు.

క్షణముక్తేశ్వరుని హుండీ ఆదాయం రూ.88,152

అయినవిల్లి: శివరాత్రి సందర్భంగా ముక్తేశ్వరంలోని క్షణముక్తేశ్వరుని హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. స్వామివారి హుండీల ద్వారా రూ.88,152 సమకూరినట్లు ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. పేరూరు గ్రూపు ఆలయాల ఈవో సాయిరామ్ పర్యవేక్షణలో ఈ హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా పెద్దింట్లమ్మ ఆలయ వార్షికోత్సవం

మామిడికుదురు: గోగన్నమఠం గ్రామ శివారు తోటమెరకలో కొలువుదీరిన పెద్దింట్లమ్మ అమ్మవారి 55వ వార్షికోత్సవం పూజలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 8వ తేదీ వరకు అమ్మవారి వార్షికోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. ఈ నెల 20వ తేదీ బుధవారం అమ్మవారి కల్యాణం, కుంకుమ పూజ, 21వ తేదీ ప్రభ ఊరేగింపు, 26వ తేదీ జాతర జరుగుతుందన్నారు. ఏప్రిల్ 7వ తేదీ ఆదివారం భారీ అన్న సమారాధన జరుగుతుందని కమిటీ పేర్కొంది.

పంట కాలువలో పూడికతీతకు చర్యలు

అంబాజీపేట: శివారు ప్రాంత భూములకు సాగునీరు అందించేందుకు పంట బోదెల్లో పూడికతీత పనులు చేపట్టామని పి.గన్నవరం ఏడీఏ ఎస్‌జేవీ రామ్మోహనరావు అన్నారు. అంబాజీపేట మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎంఎం శెట్టి అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమావేశం సోమవారం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శివారు ప్రాంత భూములకు నీరు అందించేందుకు పంట కాల్వల పూడికతీత పనులు వేగవంతంగా చేస్తున్నామన్నారు. తహసీల్దార్, వ్యవసాయ అధికారులు, ఇరిగేషన్ అధికారుల ఆధ్వర్యంలో మండలంలోని కె.పెదపూడి, వ్యాఘ్రేశ్వరం, అంబాజీపేట, ఇసుకపూడి, పసుపల్లి మెయిన్ చానళ్లలో పూడికతీత పనులు చేపట్టామన్నారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్ కుమార్, మండలి సభ్యులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు కవాతు

మలికిపురం: రానున్న ఎన్నికల నేపథ్యంలో మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన కేశనపల్లి, గొల్లపాలెం, తూర్పుపాలెం, పడమటిపాలెం గ్రామాల్లో సోమవారం పోలీస్ కవాతు నిర్వహించారు. సీఆర్‌పీఎఫ్ బలగాలతో మలికిపురం ఎస్సై బి.సంపత్ కుమార్ కవాతు నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. అల్లర్లు సృష్టించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

మలికిపురం: కెనరా బ్యాంక్ లక్కవరం బ్రాంచ్‌లో ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు బ్యాంక్ వ్యవస్థాపకుడు రుద్రరాజు గోపాలకృష్ణంరాజు అన్నారు. గ్రామంలో బ్యాంక్ బ్రాంచ్ ఏర్పాటు చేసి 9 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఖాతాదారుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ తక్కువ టైంలో ఎక్కువ వ్యాపారం చేసినందుకు మేనేజర్ మరియు సిబ్బందిని అభినందించారు. మేనేజరు షణ్ముఖ సంతోష్ మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన సేవలు ఎల్లప్పుడూ అందిస్తామని అన్నారు. ముందుగా కెనరా బ్యాంకు వ్యవస్థాపకుడు పాయ్ చిత్రపటానికి పూలదండ వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఖాతాదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నుకునేందుకు సిద్ధం



రాజోలులో గొల్లపల్లిని సత్కరిస్తున్న ముస్లిం గురువు, పార్టీ కార్యకర్తలు

రాజోలు: వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా ఎన్నుకునేందుకు అన్ని వర్గాలు సిద్ధంగా ఉన్నాయని రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయ కర్త, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. సోమవారం ఆయన రాజోలు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలను మర్యాదపూర్వకంగా కలిశారు. రాజోలు రెల్లి కాలనీలో ఆలయంలో గొల్లపల్లి పూజలు నిర్వహించారు. రాజోలు మసీదుకు చెందిన గురువులు గొల్లపల్లిని ఆశీర్వదించారు. గొల్లపల్లి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ రానున్న ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాజోలు, శివకోడు సర్పంచ్‌లు రేవు జ్యోతి, నక్కా రామారావు, ఎంపీటీసీలు చెల్లింగి లక్ష్మీఈశ్వరి, కొపనాతి పుష్పలత, పార్టీ నాయకులు మట్టా ఏడుకొండలు, అడబాల జానకిరామ్ తదితరులను గొల్లపల్లి కలుసుకున్నారు.

పలు అభివృద్ధి పనుల ప్రారంభం

రావులపాలెం: మండలంలోని రావులపాడులో సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రారంభించారు. రూ.16 లక్షలతో నాడు–నేడు పథకంలో రావులపాడు శివారు పూరేటి వారి చెరువులో అభివృద్ధి చేసిన ఎంపీపీ ప్రాథమిక పాఠశాలను, కాలువగట్టు వద్ద రూ.21.50 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన నిధుల్లో రూ.10 లక్షలు పూరేటివారిచెరువులో బీసీ కమ్యూనిటీ హాల్‌కు కేటాయించారు.

విద్యార్థులకు రక్షిత తాగునీరు



చింతలపల్లిలో ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ శ్రీనివాస్

రాజోలు: విద్యార్థులకు రక్షిత తాగునీరు అందించాలని ప్రాథమిక పాఠశాలల్లో ఆర్వో ప్లాంటులు ఏర్పాటు చేస్తున్నామని ఎంపీపీ కేతా శ్రీనివాస్ అన్నారు. సోమవారం చింతలపల్లిలో పిప్పళ్ల వారి మెరక ప్రాథమిక పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటును ఎంపీపీ కేతా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఇంటిపల్లి ఆనందరాజులు ప్రారంభించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో రక్షణ గోడ నిర్మాణం చేశామని అలాగే విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసినట్టు వైస్ ఎంపీపీ ఆనందరాజు వివరించారు. ఎంఈఓ నల్లి మనోహరం, పీఎంసీ చైర్మన్ కలిగిత అరుణకుమారి, ఉపాధ్యాయులు ఆర్.ప్రసాద్, ఉప సర్పంచ్ బొక్కా రామకృష్ణ, మాజీ సర్పంచ్ తులా సత్యనారాయణ పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్ రూ.4 వేలకు పెంచాలి

కొత్తపేట: వృద్ధాప్య, వితంతువులకు పెంచిన మాదిరిగా దివ్యాంగులకు ఇచ్చే పింఛన్ రూ.4 వేలకు పెంచాలని మండల దివ్యాంగుల సంఘం గౌరవాధ్యక్షుడు పాలంగి డానియేల్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆర్డీవో జీవీవీ సత్యనారాయణకు అర్జీ సమర్పించారు.

జై భీం జెండా స్తూపం ఆవిష్కరణ

రాజోలు: తాటిపాక సెంటర్‌లోని నూతనంగా ఏర్పాటు చేసిన జై భీం జెండా స్తూపాన్ని మొగలికుదురు మాజీ సర్పంచ్ చింతా లక్ష్మి సోమవారం ఆవిష్కరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైస్ ఎంపీపీ పొలమూరి శ్యాంబాబు, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కో–ఆర్డినేటర్ చిలకపాటి శ్రీధర్, దళిత నాయకులు బొంతు మణిరాజు, నల్లి శ్రీనివాస్, కలిగిత పల్లంరాజు, మట్టా సురేష్, కొల్లాబత్తుల సతీష్, చుట్టుగుళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా శిఖర కళాపకర్షణ

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి శిఖర కళాప కర్షణ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో వివిధ పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, సప్త కలశారాధన తదితర పూజలు ఘనంగా నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ భూపతిరాజు కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు. ఈఓ మాట్లాడుతూ ఈనెల 16 స్వర్ణ శిఖర ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అందులో భాగంగా పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గరగ ప్రదక్షిణలతో మహోత్సవాలకు శ్రీకారం

సఖినేటిపల్లి: కేశవదాసుపాలెం శివారు మెండుపాలెంలో కొలువైన పెద్దింట్లమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాలు సోమవారం నుంచి మొదలయ్యాయి. మొదటి రోజు పూజారులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు సంయుక్తంగా అమ్మవారికి ప్రతిరూపంగా ఉండే గరగలను శిరస్సులపై ధరించి ఆలయ ప్రదక్షణ చేశారు. దీంతో నెలరోజుల పాటు జరిగే ఉత్సవాలకు శ్రీకారం చుట్టినట్టయింది. మంగళ వాయిద్యాలు, బాణసంచా కాల్పులతో అట్టహాసంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులతో పాటు సరిహద్దు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో పండగ వాతావరణం నెలకొంది.